ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

రాజన్న సన్నిధి..భక్తజన పెన్నిధి

వేములవాడ టౌన్, జూన్ 9: మరో రెండురోజుల్లో వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో వేములవాడ రాజన్న ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజాము నుంచే ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ప్రీతిమొక్కైన కోడెమొక్కు తీర్చుకున్నారు. క్యూలైన్ల గుండా ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు గండాదీపం మొక్కులు, కుంకుమపూజలు, పల్లకీసేవలు, కల్యాణ మొక్కులు, సత్యనారాయణవ్రతాల మొక్కులు తీర్చుకున్నారు. రాజన్నను దాదాపు 10 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, సుమారు 14 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



అయ్యేరుపల్లిలో జరిగిన వేడుకల్లో చల్మెడ లక్ష్మీనర్సింహారావు

శుభకార్యానికి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ రూరల్, జూన్ 9: వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యేరుపల్లి లో జరిగిన ఓ శుభ కార్యానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు హాజరయ్యారు. అట్టెపల్లి రాజు-లత కుతూరు మన్మితను ఆశీర్వదించారు. వెంట కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, శేఖర్, అశోక్, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లిలోని ఇంస్లాంనగర్‌కు చెందిన షేక్ ఇమామ్ కొన్ని రోజుల క్రితం గ్రైనేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు గ్రానైట్ రాయి పడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు షేక్ ఇమామ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ శ్రీనివాస్, షేక్ గోరిమియా, షేక్ ఆలీ, సయ్యద్ హైదర్, రహమాన్, అక్బర్, రషీద్ తదితరులు ఉన్నారు.

సొంతూరికి వలసజీవి మృతదేహం

- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

ఎల్లయ్య (ఫైల్)

కోనరావుపేట,జూన్ 9: గల్ఫ్ దేశంలో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి ఎల్లయ్య(48) మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరింది. విగతజీవిగా శవపేటికలో ఇంటికి వచ్చిన ఎల్లయ్యను చూసి కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. గ్రామానికి చెందిన ఎల్లయ్య ఆరేండ్లుగా దుబాయ్‌కి వెళ్తున్నాడు. రెండు నెలల క్రితం ఇంటికి వచ్చి తిరిగివెళ్లాడు. అక్కడి కంపెనీలో సరియైన పనిలేకపోవడం, చేసిన పనికి జీతం తక్కువగా ఉండడంతో నిరాశ చెందాడు. ఇంటి వద్ద చేసిన రూ.6లక్షల అప్పు ఎలా తీర్చాలని భార్య రేణుకతో ఫోన్‌లో మాట్లాడి బాధపడ్డాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై తోటి స్నేహితులు పనికి వెళ్లిన తర్వాత ఈనెల 4న రూంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు రేహ్వాన్ (4) ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు ఎల్లయ్య మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో వాణీనికేతన్ 2003-04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఇల్లంతకుంట, జూన్ 9 : మండల కేంద్రంలోని వాణీనికేతన్ పాఠశాలకు చెందిన 2003-04 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో 20 సంవత్సరాల తరువాత మొదటిసారిగా కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి గురువులను సన్మానించారు. చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటపాటలతో హోరెత్తించారు. విందారగించిన తర్వాత ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

- కోనరావుపేట జడ్పీ స్కూల్ 2007-08 టెన్త్ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో కోనరావుపేట జడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, జూన్ 9: కోనరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయసమ్మేళనం ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది. వారంతా ఒక్కచోటికి చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సామూహికంగా విందారగించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. బై..బై చెప్పుకుంటూ భారమైన హృదయాలతో ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

మదినిండా..మధురస్మృతుల దొంతర

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వేములవాడ స్కూల్ 1979-80 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

జవహర్‌లాల్ నెహ్రూ స్కూల్ 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

- ఘనంగా వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 44 ఏండ్ల తర్వాత ఒక్కచోటికి
- ఆటపాటలతో సందడే సందడి

వేములవాడ టౌన్, జూన్ 9: వారందరూ ఒకే చెట్టు నీడలో..ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్నారు. గురువులు బోధించిన పాఠాలను శ్రద్ధగా విన్నారు. వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979-80లో పదో తరగతి పూర్తిచేశారు. 44 ఏండ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. పరస్పరం పలుకరించుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకొని కబుర్లలో మునిగితేలారు. అనాడు ఆడిన ఆటలు.. చిలిపి పనులు, గురువులతో చనువును నెమరేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. సామూహికంగా విందారగించారు. అనంతరం పట్టణంలోని బాలురు ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలోని పదో తరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులైన ఏ.అక్షిత్ కు రూ. 2000, సారియా అనే విద్యార్థికి రూ. 2000. క్రాంతి, రాఘవేందర్‌రావుకు రూ. వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. కార్యక్రమంలో 1979-80 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఫౌండర్ అధ్యక్షులు నమిలకొండ వెంకటేశ్వర్లు, రాజేశ్, కేశన్నగారి శ్రీకాంత్, సంకేపల్లి హరికిషన్, మధు రఘునందన్, నగుబోతు రమేశ్, ఎల్ శ్రీనివాస్, అప్పాల శ్రీనివాస్, నాగరాజు, కృష్ణ, రాజశేఖర్, నాగేందర్, నూగూరి శ్రీనివాస్, మచ్చ కిషన్, శివరాజు, రవీందర్ తదితరులు ఉన్నారు.

జేఎన్ స్కూల్ పూర్వవిద్యార్థులు..

పట్టణంలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్కూల్ 2002-03 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 21 ఏండ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. డ్యాన్స్‌లతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. విందారంగించిన తర్వాత ఇండ్లళ్లకు తిరిగివెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో జవహర్ విద్యాసంస్థల చైర్మన్ ఈశ్వరగారి నరహరిశర్మ, ఉపాధ్యాయులు జగన్మోహన్, వేణు, సూర్యప్రకాశ్, రమేశ్, శ్రీకాంత్, ఊర్మిళ, ఉమారాణి, విద్యార్థులు కీసరి అర్జున్, మాడిశెట్టి సాయికృష్ణ, శ్రీ నివాస్‌రెడ్డి, వాగేశ్, సాగరం మహేశ్, నా మాల శేఖర్, అనూష, శ్రీనిత, స్వాతి ఉన్నారు.

గుడి చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆదిశ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ టౌన్, జూన్ 9: మూలవాగు, గుడి చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగాభవానీ బోనాల మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నానని తెలిపారు. గంగమ్మతల్లి వద్దకు వచ్చేలా అనుబంధంగా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం అధ్యక్షుడు పంపరి శంకర్, దేవయ్య, కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, ఇప్పపూల అజయ్, పుల్కం రాజు, గూడూరి మధు, నామాల లక్ష్మీరాజం,అరుణ్‌తేజాచారి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌కు అభినందనలు

లక్ష్మీనారాయణను అభినందిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 9: సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన రాపెల్లి లక్ష్మీనారయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం తంగళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మీరాల భాస్కర్ యాదవ్, మిట్టపల్లి జవహర్‌రెడ్డి, గుండు ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

అగ్రహారం డిగ్రీ కళాశాల సెంటర్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, జూన్ 6: వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ, జేఎన్టీయూ కాలేజీలోని గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. పరీక్ష నిర్వహణపై, వసతుల కల్పనపై ఆరా తీశారు. పలు గదుల్లో కలియదిరిగి పరీక్షలను పర్యవేక్షించారు. వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కనగర్తిలో కుట్టు మిషన్ల పంపిణీ

కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, జూన్ 9: మండలంలోని కనగర్తిలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓడెల శివ, భూమ లింగం, ప్రకాశ్‌కు కుట్టుమిషన్లు ఇస్తానని మాట ఇచ్చారు. ఆదివారం పార్టీ మండలాధ్యక్షుడి చేతుల మీదుగా కుట్టుమిషన్లు అందజేసి హామీ నిలబెట్టుకున్నారు. ఇక్కడ గ్రామశాఖ అధ్యక్షుడు వంగపల్లి దేవరాజు, పులి ప్రకాష్, శంకర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

వేములవాడ రూరల్, మే 9: రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేస్తామని రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ మండలం రుద్రవరం, సంకెపల్లి, అయ్యేరుపల్లి గోదాంలలో 20-20 ఎరువుల బస్తాలను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని గ్రామాల్లోని గోదాంలో ఎరువులను ఉంచామని, రైతుల ఇండ్లవద్దకే ఎరువులను సరఫరా చేస్తున్నామన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బోయినపల్లి మండలం విలాసాగర్‌లో నెత్తిన బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

బోయినపల్లి, జూన్ 9:మండలంలోని విలాసాగర్, నర్సింగాపూర్, బోయినపల్లి గ్రామాల్లో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొన్నారు. బోనం, నైవేద్యం సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలోఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో చలి బోనాలు

రుద్రంగి, జూన్ 9: రుద్రంగి 1వ, 2వ వార్డుల్లోని మహిళలు ఆదివారం పోచమ్మకు చలి బోనాలు తీశారు. తెల్లవారుజామున మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పడి, పశు సంపదతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

వేడుకల్లో విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూన్ 9 : వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో జరిగిన పోచమ్మ బోనాల వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, నాయకులు రమణరెడ్డి, శేఖర్, సంఘస్వామి ఉన్నారు.

రుద్రంగి: చలిబోనాలు తీస్తున్న మహిళలు

చందుర్తి, జూన్ 9: మండలంలోని మూడపల్లిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యం లో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి పిల్లాజెల్లను సల్లంగా చూడాలని వేడుకున్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం

బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

సిరిసిల్ల రూరల్, జూన్ 9: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయికి జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాట్ల మధు, సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, అబ్బాడి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

కలెక్టరేట్, జూన్ 9: మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు ఒక రోజు అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ మండలం శాత్రాజుపల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో పైపులైన్ మరమ్మతులు నిర్వహించనున్నామన్నారు. ఈ కారణంగా ఈనెల 11న మంగళవారం వేములవాడ రూరల్, మల్యాల, కొడిమ్యాల్, బోయినపల్లి, గంగాధర, చొప్పదండి మండలాల్లోని గ్రామాలకు, చొప్పదండి మున్సిపాలిటీకి నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు. ఈనెల 12న బుధవారం భగీరథ నీటి ని పునరుద్ధరిస్తామని వెల్లడించారు. అప్పటివరకు ఆయా గ్రామా ల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

చందుర్తి, జూన్ 9: చందుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలో గల రావిచెట్టు పై గల తేనెటీగలు ఒక్కసారిగా లేచి రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలతో పాటు సైకిల్‌పై వెళ్తున్న వారిపై దాడి చేశారు. ఈ సంఘటనలో సుమారు 15 మంది గాయపడ్డారు. కొంత మంది గ్రామస్తులు తేనెటీగల భారి నుంచి తప్పించుకోవడం కోసం పరుగులు తీశారు.

చెరువు మట్టిని తరలిస్తున్న టిప్పర్ల అడ్డగింత

వేములవాడ రూరల్, జూన్ 9: వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని దేవతుల చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ టిప్పర్లతో మట్టిని తరలించడంతో కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు టిప్పర్లను వెళ్లనీయబోమని తేల్చిచెప్పారు. అధికారులు జోక్యం చేసుకొని మరమ్మతులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 9: 132 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ పృథ్వి తెలిపారు. ఎల్లారెడ్డిపేట, దుమాల, పరదిర, నారాయణపూర్, బండలింగంపల్లి, అక్కపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, కిష్టూ నాయక్ తండా, కోరుట్లపేట, బొప్పాపూర్, గొల్లపల్లి, సింగారంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కరెంట్ ఉండదని వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వడ దెబ్బతో కూలీ మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 9: దుమాలకు చెందిన ముక్క లక్ష్మి(50) అనే మహిళ వడ దెబ్బ తో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు రోజులుగా ఎండలో మట్టి పనికి వెళ్లిందన్నారు. ఈ క్రమంలో గత రాత్రి అస్వస్థతతోనే నిద్రకు ఉపక్రమించిన లక్ష్మి తెల్లాసరి చూసేసరికి విగతజీవిగా కనిపించిందన్నారు. మృతురాలి కుటుంబాన్నికుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

డెయిరీ కార్యవర్గం

కోనరావుపేట, జూన్ 9: మండలంలోని ధర్మారం గ్రామంలో కరీంనగర్ డెయిరీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆసరి ఎల్లయ్య, డైరెక్టర్లుగా పొట్టపల్లి మహేంద్‌రావు, కొమటిరెడ్డి లచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రావు,తాళ్లపల్లి పాపయ్య, గంగుల బాలకిషన్, దుంద్రెపల్లి బక్కయ్య, మల్లయ్య, బ్యాలయ్య, కార్యదర్శిగా నక్క పరశురాములు ఎన్నికయ్యారు.

వృక్షాల నరికివేత

కరీంనగర్ రూరల్, జూన్ 9: మండలంలోని జూబ్లీనగర్- చామనపల్లి గ్రామాల మధ్య ఉన్న వృక్షాలను కొద్ది రోజులుగా కొందరు ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారు. ఇటీవల పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇదే దారిలో వచ్చిన కలెక్టర్, చామనపల్లి మానస సరోవరం వద్ద మొక్కలు నాటి, పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యతకను స్థానికులకు వివరించారు. కనీసం ఐదు రోజులు కూడా గడవకముందే బాటసారులకు చల్లని నీడను పంచుతున్న వృక్షాలు గొడ్డలి వేటుకు గురి కావడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, ఈ దారిలో ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లను కాపాడాలని కోరుతున్నారు.

డీసీఎం వ్యాన్ ఢీ

ఒకరికి తీవ్రగాయాలు

వీణవంక, జూన్ 9: మండలంలోని చల్లూరు పెట్రోల్ బంక్ వద్ద డీసీఎం వ్యాన్ మోటర్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఒజ్జె నారాయణ ఆదివారం మోటార్ సైకిల్‌పై పని మీద చల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా, అదే సమయంలో పోతిరెడ్డిపల్లి నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న డీసీఎం వ్యాన్ చల్లూరు పెట్రోల్ బంక్ వద్ద ఢీకొన్నది. మోటార్ సైకిల్ పైనుంచి పడడంతో ఒజ్జె నారాయణ కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే నారాయణను కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చొప్పదండి, జూన్ 9: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు బైరగోని ఆనంద్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులకు అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి సొసైటీ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్ గౌడ్, డైరెక్టర్ నాంపల్లి మల్లయ్య, నాయకులు మునిగాల చందు, ఏలేటి తిరుపతిరెడ్డి, కిట్టు గౌడ్ పాల్గొన్నారు.

యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణచౌక్, జూన్ 9: యాదవులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కన్నెబోయిన ఓదెలు యాదవ్, జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు అధిక ప్రాధాన్యాతను కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో యాదవులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీందర్, వెంకటమల్లు యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు సందబోయిన గీతాంజలి, నాయకులు రాజ్‌కుమార్, రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రవి యాదవ్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై విచారణ జరుపాలి

తెలంగాణచౌక్, జూన్ 9: దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరుపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 724 మార్కులకు 724 మార్కులు రావడంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.